# అసిరిగాడి డేగ



**- పత్తిపాటి నాగేంద్రప్రసాద్**

అవి సంక్రాంతి రోజులు. తెల్లవార వస్తోంది. పల్లె మెల్లమెల్లగా నిదుర మంపును విదిలించుకొంటోంది.

పల్లె లేవాలని వున్నా లేవలేక లేవలేక లేస్తోంది.

బుడతలు అక్కడక్కడ చలి కాచుకుంటున్నారు. మపకమపకగా కప్పిస్తున్నాయి చలిమంటలు. మంచు ముసుగులోంచి ఓ కుక్కపిల్ల లేచింది. వళ్ళు విదిల్చింది. చెవులు టపటపా కొట్టింది. వెళ్ళిపోయింది. వెలుగు కప్పిస్తోన్న వైపుకు.

అపిరిగాడు కుక్కి మంచంలో బద్దకంగా అటూ ఇటూ కదులుతూ, ఒళ్ళు విరుస్తున్నాడు. ఆ కదలికతో కుక్కి మంచం నులక పుటుపుటా తెగుతోంది. మంచం కింద మలకతాళ్ళు శోభనం నాటి పందిరి మంచానికి పూలమాలల్లా వేలాడుతున్నాయి.

తెల్లవార వస్తోందంటూ గూటిలోని పందెగాడు (డేగ అనే కోడి పుంజు) కిందకు దూకింది. ఎడమకాలు ఎత్తింది. ఎడమ రెక్కను విసనకర్రలా సాచింది. ముక్కుతో ఈకలు సవరించింది. రెక్కలు టపటప లాడించింది. మెడను సాచి మెడపై ఈకలను నిక్కించింది. "నేనే పందెగాడ్ని" అనుకుంటుందేమో "కొక్కొరో...కో.." అంటూ సాటి పందెగాళ్ళను పిలుస్తోంది.

"ఏరా! అపిరిగా! పైటేలకాడ పెద్దయ్య ఏదో మజా చేత్తడన్నవు. సుక్కైతే.. ఇత్తడేమోగాని ముక్కలేత్తడా? ఈ గవురుమెంటోల్లు ఆడోల్లమాటలివి సారమ్మ తల్లిని కంటబడకుండ జేత్తిరి. నా మనసు తెగబీక్క పత్తుందిరా!" అంటూ పందేనికి రెచ్చగొట్టడానికొచ్చాడు జెల్లడు.

ముందే పందేనికి పిద్దంగా వున్న అసిరిగాడు రెచ్చిపొయ్యాడు. "ఒరే.. జెల్లా! ఈ యాల పెద్దయ్యగారెటు దిరిగి సుక్కప్పిత్తరు. పోతుగడ్డమీద కోడి పందె మేత్తరంట. నాకు సపోట్టుగ నువ్వుండాలె" అని జెల్లడిని పిలిచేడు.

పల్లెకు ఐదు కిలోమీటర్ల దూరములో పోతుగడ్డుంది. దాని మీద తరాల నాటి మర్రిచెట్టు. ఆ మర్రినీడకు కోడి పందేల ఆనవాయితీ తరాలనాటిది. ఇప్పటికీ పండుగ పబ్బాలకు చాటుమాటుగ పందేలు సాగుతూనే వుంటాయి. ఆ దారిలోనిదే ఈ కోడి పందెం.

అపిరిగాడు ఉట్టిమీది గంజి పిసరు తాగేడు. తన డేగను చంక నేసుకున్నాడు. ఈరయ్య దగ్గర ఆకురాయి రాయించుకున్నాడు. పోతుగడ్డ వైపు పయనమయ్యాడు. "ఏంది మావా!... నీ ఉరుకులూ పరుగులూ? ఎప్పుడూ తాగుడూ తిరుగుడూ పందేలూ దప్ప, ఇల్లోకిలేం బట్టదా?" అంది లచ్చి.

"నాకు దెల్పులేయే! పొద్దస్తమానం యాడికి బోదమన్న నీ యదవ గొడవొకటి. పో.. ముందు?... దాటవతలకి..." దారి బట్టేడు.

అపిరిగాడి ఆరేడేళ్ళ కొడుకు అబ్బులు లేడిలా చెంగు చెంగున గంతులేస్తూ వచ్చాడు. జారుతున్న సల్లాడాన్ని ఎగలాక్కుంటూ, అపిరిగాడి కాళ్ళకు అడ్డం పడుతూ "అయ్యా! నాకో పావలియ్యావ్, నూగుజీడ్లు గొనుక్కుంత" అని గోముపడ్డాడు. "ఆ! ఇంద... పట్టూ..." అంటూ ఓ పావలా

16-2-96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

చేతిలో పెట్టి నడక సాగించాడు.

దారిలో పెద్దూరు ప్రెసిడెంటు నడివీధిలో కొలువైయున్నాడు. పిచ్చగుంట్లు పలనాటి సుద్దులు ఆడుతూ, పెద్దయ్యను పొగుడుతున్నారు. అపిరిగాడు అక్కడ ఆగేడు. చూపులు పెద్దయ్యపైకి మరల్చేడు. ప్రెసిడెంటు చూపు అపిరిగాడి చూపులో కలిసింది. "దండాలుదొర" అని దండాలు పెట్టేడు అపిరిగాడు.

"జెల్లడేడిరా? పొద్దునవంగ జెబితే అంతు లేదు"

"మనింటి సాయబొయిందు దొర"

"ఆ.. సరే"

"అయ్యా పందేనికెల్తుండ. సందేలకొస్త. శలవియండ్రి దొరా!... "శెలవేందిరా. జయం ముందే వెళ్ళిరా" అని శలవిచ్చాడు దొర. అపిరిగాడు ఆరిపోయిందన్నట్లు పరుగు పరుగున ఊరుదాటి, ఊరవతల ఏరుదాటి, కడనవున్న కాదుదాటి, కాయమని కాళికి దండమెట్టి పరుగులాంటి నడకతో పోతుగడ్డకు చేరుకున్నాడు.

పోతుగడ్డ క్రిక్కిరిసింది. పందెం ముమ్మరంగ సాగుతోంది. కుక్కుటాల కొక్కొరోలు కోకొల్లలు. కొంత మంది పందెగాళ్ళు కోళ్ళను రెచ్చగొట్టి బరిలోకి ఉరికిస్తున్నరు. తాముమెచ్చి మచ్చిక చేసిన పుంజులను చూపి రెచ్చిపోతున్నారు. పందెగాళ్ళు మధ్య మధ్యలో పుంజుల వీపులు దువ్వుతున్నారు. మెడను సవరిస్తున్నారు. అలసిన కోళ్ళ గొంతుల్లో ఉమ్మిపోసి అలసట తీరుస్తున్నారు. పై పందెగాళ్ళు ఆవేశకాశాలతో మీసాలు మెలివేసి పోటీ పడుతున్నారు.

అపిరిగాడికి ఆ దృశ్యం మత్తెక్కిస్తోంది. నోరూరింది. డేగకు కత్తి కట్టే . ..ంపాడు బరిలోకి. డేగ కండబలం, గుండెబలం చూప సాగింది. డేగ రెక్కలను లేపి, మెడను సాచి, కాలు దువ్వి కదనానికురికింది. ఎదిరిని జుట్టులాగి రెచ్చగొట్టింది. పోరు సాగింది.ప్రత్యర్థి ఓడింది. నేల కొరిగింది.

అపిరిగాడు మరలా దించాడు డేగను రంగంలోకి. డేగ కదిసమయం కాదు. అపిరిగాడు విషాలో బుచ్చిగాడి నెమలి (నెమలి అనే కోడి పుంజు) మీద కురికించాడు. డేగ, నెమలి పోరాటం మల్ల యుద్ధంలా వుంది. చూసేవారికది భీమదుర్యోధనుల మల్లయుద్ధం గుర్తుకు తెస్తోంది డేగ తొలి తన్నుకు నెమలి తగ్గింది. బుచ్చిగాడు నెమలి నెత్తుకుని వీపు దువ్వి గొంతు సవరించి మరలా వదిలాడు. అపిరిగాడు డేగ వొదులుతూ జుత్తును నోటితో కొరికి, కసిరేపి, ఉసిగొల్పి నెమలిపై వదిలేడు. పట్టుదల హెచ్చింది. నెమలీ డేగ పట్టుకోసం కైవారం తిరుగుతున్నాయి. ఒకదానినొకటి క్రొక్కరించుకుంటున్నాయి. కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. డేగకు కాని కాలం దాపురించింది. అదను చూసి నెమలి తప్పింది. నెమలి కత్తి డేగ గుండెల్లోకి దూసుకపోయింది. నేల కొరిగింది డేగ. ఈ కాలం నెమలిది. అపిరిగాడి తల వాలింది.

పశ్చిమాన పండంటి ఎరుపుతో రెండు కొండల మధ్యకు దిగిపోయాడు సూరేడు. అపిరిగాడు వచ్చిన కోడిని భుజానేసుకుని పల్లెకు నడవసాగేడు. ఏరుదాటుతున్నాడు. చెట్టుపైన బుషిపక్షి పట్టు జారిందేమో, రెక్కలు మసిగుడ్డలా సాచి గాలిలో కెగిరింది. కీచురాళ్ళు కీచుకీచుమంటూ రొద చేస్తున్నాయి. పాదాల కింద పండుటాకులు గలగలమని జడిపిస్తున్నాయి. గుండె దిటవు చేసుకొని అడుగులో అడుగు వేసుకుంటూ పల్లెలో అడుగు పెట్టేడు.

అపిరిగాడి మనసు గిజిగాడి గూడైంది. గుడిసె చేరేడు. గుడిసె మసనం లాగుంది. బొచ్చె ముందు బువ్వలో డేగ ప్రత్యక్షమవుతోంది. బువ్వ సగించలేదు. చేతులు కడిగేడు. కాలుగాలిన పిల్లిలా గుడిసె ముందు దిరుగుతున్నాడు. గుబులు గుబులున డేగ గుర్తుకొస్తోంది. గూటిలోనికి తొంగి చూసేడు. పుంజుకోసం తిరిగి తిరిగిన పెట్ట గువ్వై ఒదిగి ఓ మూల గూకుంది దిగులుగా. అపిరిగాడిని చూసి "కొరకొర" మంది. తలను రెక్కల మధ్య దొనుపుకొని ముడుచుకకూచుంది.

నులక మంచం మీద పండుకున్నాడు. అటూ యిటూ పొర్లుతున్నాడు. నులక మంచం నాగె జెముడు పట్లల్లె వుంది.నిద్రపట్టలేదు. గుడిసె కప్పొంక చూసేడు. సందుల్లోంచి ఆకసాన ఓ చుక్క డేగలా కన్పిస్తోంది. గబుక్కున చూపు మరల్చుకున్నాడు. చింకిచాప మీద లచ్చి గుర్రు బెడుతోంది. ఆమె పక్కలో ఆడి ఆడి అలసిన అబ్బులు ఆదమరచి నిదరోతున్నాడు. అపిరిగాడికి తెల్లారగట్ల నిద్రబట్టింది మాగమ్నగ.

డేగ అపిరిగాడి గుండెల మీద కూర్చుంది. కంటి నిమేషకం మూసింది. కనుకొలుకుల్లోనీళ్ళింకి పోయినయి. నెత్తుటితో తానమాడినట్లుంది. శరీరం మీద ఈకలు అక్కడక్కడ ఊడినయి. ఒక రెక్క విరిగి జారింది. బొండిగ పగిలి రక్తం ముద్దలాగుంది. గాయాల సలుపులకు ఒణుకుతోంది. అడుగుతోంది అపిరిగాడిని "అబ్బులెక్కన నన్నూ బెంచినవ్. ఈడొచ్చిన యాలనన్ను పందేని కొదిలినవ్. పందేన గెలిస్తి. మది నిండక మల్లా వదిలితివి. రెచ్చిపోతివి. నా సావు నీకు ఆనందమాయె. ఎందుకూ! నీ జాతికి మా జాతి మీద ఇంత కసి. రెక్కలిచ్చి వోడు ఎంత పాపిష్టోడో... సక్కంగా ఆకాశంలో ఎగరనివ్వక మీ చేత చిక్కనిచ్చిండు. ఇది మా పాలిటి శాపమయింది. ఎద్దులెక్కన చాకిరీ చేసి ఆదమరిసి నిదరోతుంటే ఏ జాముకాజాము నీకు ఎరిక జేస్తుంటిని. డొక్క నింపనోడిని నువ్వే నా డొక్క పీలిస్తే దిక్కు వురు నాకు? నా జాతి ఈ భూతలాన కరువైననాడు కాలం దప్పి కూసి కలవరం బుట్టిస్తం. ఇక నా కూత నీకు కరువైంది. నీ కాలం నీకు తెలవకుండ బోద్ది. గుర్తువెట్టుకో"అని హెచ్చరిస్తోంది. ఏడుస్తోంది.

తూర్పున ఎరుపు మెల మెల్లగా తెలుపెక్కుతోంది. గుడిసె కప్ప సందుల్లోంచి ఎండ దెబ్బకు అపిరిగాడికి చురుకు బుట్టి మెలకువొచ్చింది. కల కరిగింది. డేగ ఆకాశంలోకి ఆ పైన పైలోకానికి ఎగిరిపోయింది.

